సాక్షి వైఎస్సార్ జిల్లా

సోమవారం, 29, ఏప్రిల్, 2024



వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

వైఎస్సార్ జిల్లాలోని పలు మండలాల్లో టీడీపీ నాయకులు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. - 8లో



జంట హత్యల కేసులో అరెస్టు

చిన్నమండెం మండలం దిగువగొట్టివీడు గ్రామం కమ్మపల్లె వద్ద జరిగిన జంటహత్యల కేసులో నిందితులను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. -8లో

గరిష్టం/కనిష్టం
43.6/26.8

వాతావరణం

జిల్లాలో ఆదివారం 26.8 - 43.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

4న 'మన ఆర్థిక పరిస్థితి.. దేశ భవిష్యత్తు'పై సదస్సు

కడప రూరల్: కడప సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యం లో మే నెల 4వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటలకు కడప నగరంలోని ఐఎంఏ హాలులో మన దేశ ఆర్థిక పరిస్థితి.. దేశ భవిష్యత్తు అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫోరం సభ్యులు డాక్టర్ సి.ఓబుల్‌రెడ్డి, బి.లక్ష్మీరాజా తెలిపారు. ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్ ప్రధాన ఉపన్యాసం చేస్తారన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ దేశం వెలిగిపోతోంది..పేదరికం తగ్గిందని గొప్పలు చెబుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో దేశ ఆర్థిక పరిస్థితిపై చర్చించేందుకు ఈ సదస్సు నిర్వ హిస్తున్నామన్నారు. విద్యావేత్తలు, మేధావులు, ప్రముఖులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో లెనిన్ ప్రసాద్, భాస్కర్, శివరాం, గౌతం శ్రీనివాసులురెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీసెట్-2024



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఏపీ సెట్)-2024 ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు 84.83 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. పోలీసులు, కళాశాల సిబ్బంది అభ్యర్థుల హాల్‌టికెట్‌లు, గుర్తింపుకార్డులు పరిశీలించాక పరీక్షా కేంద్రం లోకి అనుమతించారు. యోగివేమన విశ్వవిద్యాలయంతో పాటు కడప నగరంలోని 8 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ వైవీయూతో పాటు నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈయనతో పాటు ఏపీసెట్ ప్రాంతీయ సమన్వయకర్త ఆచార్య పి.ఎస్.షావల్లీఖాన్ పరీక్షలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 పరీక్షా కేంద్రాల్లో 2047 మంది పరీక్షలకు హాజరయ్యారని, 336 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ప్రత్యేక పరిశీలకులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. వీరితో పాటు ఏపీ సెట్ స్పెషల్ అబ్జర్వర్, వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి కడప నగరంలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా మేనిఫెస్టో



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి

రాయచోటి: సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా, పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేలా వైఎస్సార్‌సీపీ 2024 మేనిఫెస్టో రూపొందించారని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం రామాపురం మండలం, రాచపల్లెలో ఆయన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్ రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు పూర్తి నమ్మకం కలిగించిన వ్యక్తిగా సీఎం జగన్ మోహన్ రెడ్డి నిలిచారన్నారు. 2014లో చంద్రబాబు 600 హామీలతో మేనిఫెస్టో విడుదల చేస్తే ఐదుశాతం హామీలను కూడా అమలు చేయలేదన్నారు. వైఎస్ జగన్ 2019 ఎన్నికల్లో రెండు పేజీల మేనిఫెస్టోను ఇచ్చారన్నారు. తన పరిపాలనా కాలంలో 99 శాతానికిపైగా హామీలను అమలు చేసి మాట మీద నిలబడే వ్యక్తిగా పేరొందారన్నారు. ప్రస్తుతం సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టోలో ముఖ్యంగా మహిళల ఆర్థిక పరిస్థితుల మెరుగుదలకు, మిగిలిన పథకాలను కొనసాగిస్తూ వాటి నుంచి అందే లబ్ధిని రెట్టింపు చేయడం మహిళలలో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు. అలాగే మిగిలిన అన్ని వర్గాల వారికి మేలు చేకూర్చేలా మేనిఫెస్టో ఉందని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో ఆరు నియోజకవర్గాలు ఉంటే మదనపల్లెకు వెళ్లినప్పుడు మదనపల్లిని, రాజంపేటకు వెళ్లినప్పుడు రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తానని చంద్రబాబు, లోకేష్‌లు మాట్లాడి ప్రజలను రెచ్చగొట్టేలా ప్రాంతాలు, ప్రజల మధ్య చిచ్చుపెట్టే విధంగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ముందుచూపు ఆలోచనలతో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి తీరుతానని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పీజీ కేంద్రాన్ని యూనివర్సిటీగా అభివృద్ధి చేస్తానన్నారు.

బెదిరింపుల పర్వం!

- మీకేం కావాలో చెప్పండి చేసి పెడతా... అడ్డు నిలిస్తే ఓర్చుకునేది లేదు
- ఎప్పటిలాగే ఏకపక్షంగానే పోలింగ్ ఉండాలి
- దేవగుడి పల్లెల్లో హెచ్చరికలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి
- వచ్చేది ఉమ్మడి ప్రభుత్వమే.. పాత రోజులు రానీయొద్దు
- నియోజకవర్గవ్యాప్తంగా వార్నింగ్‌లు ఇస్తున్న వైనం



సాక్షి ప్రతినిధి, కడప: ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తే, దరిదాపుల్లో కూడా నిలవలేం. అవకాశం ఉన్న చోట పోలింగ్ ఏకపక్షంగా నిర్వహించుకునే చర్యలు చేపట్టాలి. అందుకు ఎవరి స్థాయిలో వారు పనిచేయండి. నా ప్రమేయం అవసరమైన చోట చెప్పండి. నేనే స్వయంగా రంగంలోకి దిగుతా. నయానో.. భయానో ఈమారు అనుకూలంగా మలుచుకోవాలి. ఎవరి పాత్ర వారు సమర్థవంతంగా నిర్వర్తించండి. మరీ ముఖ్యంగా ఈ ఏడు గ్రామాల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.. అని జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి కుటుంబ సభ్యులకు దిశా-నిర్దేశం చేశారు. ఆపై బెదిరింపుల పర్వానికి తెరలేపుతున్నారు.


దేవగుడి పరిసర ప్రాంతాలైన గొరిగెనూరు, ధర్మాపురం, సున్నపురాళ్లపల్లె, పెద్దదండ్లూరు, సుగమంచిపల్లె, శేషారెడ్డిపల్లె, శిరిగేపల్లె గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. వైఎస్ రాజశేఖరరెడ్డి అనుచరులుగా ఉన్నప్పుడు ఆయా గ్రామాల ప్రజలు దేవగుడి కుటుంబానికి మద్దతుగా ఉండేవారు. దేవగుడి సోదరులు తెలుగుదేశం పార్టీలో చేరిన తర్వాత అదే గ్రామాలకు చెందిన వారు వైఎస్ కుటుంబం వెంట నడుస్తూ వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచారు. తాజాగా బీజేపీ అభ్యర్థిగా ఆదినారాయణ రెడ్డి తెరపైకి వచ్చాక, ఇప్పుడు అవే గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారు. సోదరులను ఆయా నేతలపైకి ఉసిగొల్పారు. సౌమ్యంగా మద్దతు కోరండి, డబ్బు ఆశ చూపండి, అప్పటికీ మీమాట వినని వారితో నేను స్వయంగా మాట్లాడతా.. తర్వాత దౌర్జన్యం చేసేందుకు కూడా వెనుకడవద్దని వెల్లడించినట్లు విశ్వసనీయ సమాచారం. అందులో భాగంగా ఇప్పటికే ఆ ఏడు గ్రామాలకు చెందిన నాయకులతో వివిధ సందర్భాల్లో మాట్లాడుతూ మంచిగా మద్దతు కోరుతున్నట్లు సమాచారం. రాబోవు రోజుల్లో మరింత స్పీడు పెంచి భయపెట్టుకోవాలనే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రజాస్వామ్యబద్ధంగా వెళ్తే...

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలకు వెళ్తే దరిదాపుల్లో కూడా పోటీలో నిలువలేమనే అంచనాకు దేవగుడి సోదరులు వచ్చినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో దాదాపు 87 శాతం ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందినట్లు గుర్తించారు. ఓటుకు వెళ్తే అభ్యర్థులతో నిమిత్తం లేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా వైఎస్సార్‌సీపీకి మద్దతు లభిస్తున్నట్లు గ్రహించారు. ఇక పాత తరహాలో పోలింగ్ చేపట్టక పోతే ఉపయోగం లేదనే అంచనాకు వచ్చారు. ఈ క్రమంలోనే మైలవరం మండలంలో ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన ఓ సర్పంచ్‌పై బెదిరింపులకు దిగినట్లు తెలిసింది. వైఎస్సార్‌సీపీకి ప్రచారం వరకే పరిమితం కావాలని, పోలింగ్‌కు మూడు రోజుల ముందు నుంచి గ్రామంలో ఉండొద్దని హెచ్చరించినట్లు తెలిసింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఇదే సూత్రాన్ని అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. పాత రోజులను గుర్తు చేయవద్దనే తరహాలో బెదిరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. పరిస్థితిని బట్టి డబ్బులకు మెత్తబడే వారిని డబ్బుతో వశపరుచుకోవాలని, అలా కాదన్నవారి విషయాలపై దౌర్జన్యాకు సైతం వెనుకాడవద్దనే యోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటి నుంచే పటిష్టమైన చర్యలు చేపట్టి గ్రామస్థాయి నేతలు భయభ్రాంత్రులకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నంది వాహనంపై ముక్తిరామలింగేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక రామేశ్వరంలోని శ్రీ ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం వేకువజామున సైకతలింగానికి, రాజరాజేశ్వరి అమ్మవారికి, చండీమాతకు, ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గంగారాజరాజేశ్వరి సమేత ముక్తి రామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను నంది వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో శివనామస్మరణల మధ్య ఊరేగించారు.



నందివాహనంపై గంగారాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరుడు

సమస్యలు ఆలకిస్తూ.. ఆప్యాయంగా పలకరిస్తూ..

తొండూరు మండలం ఇనగలూరులో ప్రచారం పర్వంలో వైఎస్ భారతిరెడ్డి



పులివెందుల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సతీమణి వైఎస్ భారతి విస్తృత ప్రచారం

పులివెందుల/తొండూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిరెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సతీమణి సమతారెడ్డి, వైఎస్ మధురెడ్డి కోడలు కృష్ణచైతన్య ఆదివారం పులివెందుల నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వీరికి అపూర్వ స్వాగతం లభించింది. తొండూరు మండలం ఇనగలూరు గ్రామంలో తొలుత వినాయకుని గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. వైఎస్ మధురెడ్డి, మండల అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, తాలూకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, సర్పంచ్ గంగయ్యలు వైఎస్ భారతికి ఘన స్వాగతం పలికారు. ఇంటింటి ప్రచారంలో ప్రతి ఒక్కరిని చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరిస్తూ అసెంబ్లీ అభ్యర్థి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలకు ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు జగనన్నకే, ఎన్నికలకు మేము సిద్ధం అంటూ ఓటర్లు సమాధానం చెప్పడంతో వైఎస్ భారతి చిరునవ్వుతో ముందుకు సాగారు. వృద్ధులను, వికలాంగులను అనారోగ్యంతో ఉన్నవారిని పలకరిస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండండి మళ్లీ జగన్ ప్రభుత్వమే వస్తుంది.. అందరికి న్యాయం చేస్తామంటూ భరోసా కలిస్తూ ప్రచారంలో ముందుకు సాగారు. అనంతరం ఎరికల నాంచారమ్మ ఆలయంలో తాలూకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, ఎంపీటీసీ సావిత్రమ్మలతో పాటు మాజీ ఎంపీపీ భూమిరెడ్డి జయప్రదలు వైఎస్ భారతి, సమతారెడ్డి, కృష్ణచైతన్యలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇనగలూరు వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎరికల్‌రెడ్డి, విజయానందరెడ్డి, బాల ఎరికల రెడ్డి, లక్ష్మిరెడ్డి, మధురెడ్డి, అంకాల్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, రాష్ట్ర డైరెక్టర్లు సురేష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, సింహాద్రిపురం ఎన్నికల పరిశీలకుడు గండ్లూరి వీరశివారెడ్డి, మండల పరిశీలకుడు రామమునిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, జేసీసీ కన్వీనర్ రజనీకాంత్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజులరెడ్డి, జనార్దన్‌రెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో మహిళను ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్ భారతిరెడ్డి

అభివృద్ధి యజ్ఞం ముందుకు సాగాలి

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రాధాన్యత
- ఆర్యవైశ్యుల ఆత్మీయ సభలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ జిల్లాలో అభివృద్ధి యజ్ఞం ముందుకు సాగేందుకు జిల్లా ప్రజలంతా సహకరించాలని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఐఎంఏ హాలులో నిర్వహించిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నీతి, నిజాయితీ, క్రమశిక్షణతో వ్యాపారం చేసే సామాజికవర్గమైన ఆర్యవైశ్యులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజకీయ ప్రాధాన్యత కల్పించామన్నారు. టీటీడీలో ప్రతిసారీ ఆర్యవైశ్యులకు స్థానం కల్పిస్తున్నామన్నారు. గండి దేవస్థానం చైర్మన్ పదవి గతంలో రాఘవయ్యకు ఇచ్చామని గుర్తు చేశారు. ఈబీసీ నేస్తం ద్వారా 62వేలమందికి ఆర్థిక సాయం చేశామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ఈ జిల్లాకు ఒక మేలు కూడా జరగలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రెండేళ్లు కరోనా వల్ల కరిగిపోయినా, మిగిలిన మూడేళ్లలో వందల కోట్లు ఖర్చుపెట్టి కడపలో రహదారుల విస్తరణ, కూడళ్ల ఆధునీకరణ, డ్రైనేజీ కాలువలు నిర్మించి, రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేశామన్నారు. కేన్సర్ హాస్పిటల్, రెండు కంటి ఆసుపత్రులు, మానసిక వైద్యశాల నిర్మించడం ద్వారా వైద్యరంగంలో జిల్లాను ఒక మెట్టు పైకి ఎక్కించామన్నారు. 6వేల ఎకరాల్లో ఉన్న కొప్పర్తి పారిశ్రామిక వాడపై ముఖ్యమంత్రి జగన్‌కు ప్రత్యేక విజన్ ఉందని, అక్కడ 5 యూనిట్లు ప్రారంభమై 3వేలమంది పనిచేస్తున్నారన్నారు. రూ.200కోట్లతో నిర్మించిన ఆ పారిశ్రామిక వాడకు బ్రహ్మంసాగర్ నుంచి ప్రత్యేక పైపులైన్ కూడా వేశామన్నారు. అది పూర్తయితే శ్రీసిటీని మించిన పారిశ్రామిక కారిడార్‌గా అవతరించడం ఖాయమన్నారు. కడప-బెంగళూరు రైల్వే మార్గాన్ని కూడా పెండ్లిమర్రి నుంచి పుట్టపర్తి వరకూ అలైన్‌మెంట్ మార్చి పూర్తి చేయాలని కేంద్రానికి ముఖ్యమంత్రి జగన్ లేఖ రాశారని, సాంకేతికపరమైన, ఆర్థిక పరమైన అవకాశాలను కూడా పరిశీలించారన్నారు. కేంద్రం ఆమోదం వచ్చాక రాష్ట్రమే భూసేకరణ చేసి ఇస్తుందని, ఆ రైల్వేలైన్‌కు ముద్దనూరు లైన్‌ను కలిపితే సిమెంటు పరిశ్రమలకు, ఉక్కు పరిశ్రమకు కూడా చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ అభివృద్ధి యజ్ఞం ఇలాగే ముందుకు సాగేందుకు జిల్లా ప్రజలు సహకారమందించాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. వారి సమస్యలను కొత్తగా ఏర్పడబోయే మన ప్రభుత్వంలో పరిష్కరిస్తామన్నారు. అంతకు ముందు ఆర్యవైశ్య ప్రతినిధులు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీకి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రతినిధులు కె. సూర్యనారాయణ రావు, చిప్పగిరి ప్రసాద్, దేవతి శంకరయ్య, కరుణాకర్, రవి పాల్గొన్నారు.

సామాజిక న్యాయాన్ని ఆచరించింది జగనన్న మాత్రమే

- యాదవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాం
- ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి వెల్లడి

ప్రొద్దుటూరు: గతంలో సామాజిక న్యాయం అన్న పదాన్ని విన్నామే కానీ ఎవ్వరూ ఆచరించి చూపలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. జగనన్న మాత్రమే సామాజిక న్యాయాన్ని ఆచరించి చూపారని తెలిపారు. స్థానిక రెడ్ల కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన యాదవుల వార్షికోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ జగనన్న అమలు చేశారని తెలిపారు. సామాజిక న్యాయంలో భాగంగా బీసీలకు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద పీట వేశారన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్మన్లు, కార్పొరేషన్ మేయర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇలా అన్నింటిలో యాదవులకు స్థానం కల్పించారని తెలిపారు. బీసీలు బ్యాక్ వర్డ్ క్లాస్ కాదని బ్యాక్ బోన్ అని రూపించిన నేత మన జగనన్న అన్నారు. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ద్వారం తెరిచే బాధ్యత యాదవులదేనని గతంలో చంద్రబాబు దీనిని తీసివేసే ప్రయత్నం చేశారన్నారు. జగనన్న యాదవులకు శాశ్వత జీఓ ఇచ్చారన్నారు. ఎవ్వరు అడగకున్నా బీద మస్తాన్ రావుతోపాటు ఆర్.కృష్ణయ్యకు రాజ్యసభ సభ్యులుగా స్థానం కల్పించారన్నారు. బీసీల హక్కుల నేతగా ముద్రపడ్డ కృష్ణయ్య లాంటి వారిని పెద్దల సభకు పంపితే బీసీలకు మేలు చేసినట్లు అవుతుందనే ఉద్దేశంతోనే జగనన్న ఈ విధంగా చేశారని తెలిపారు.



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి గొర్రె పిల్లలను అందిస్తున్న యాదవ నాయకులు


బాబు హామీలు నెరవేర్చలేదు

చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. బ్యాంకులో కుదవపెట్టిన బంగారు నగలను విడిపిస్తామని, డ్వాక్రా, వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని, చివరికి ఆ మేనిఫెస్టోనే వెబ్ సైట్ నుంచి తొలగించిన ఘతన వారికే దక్కిందని తెలిపారు. జగనన్న చెప్పిందే చేస్తాడు.. చేసిందే చెబుతాడని అన్నారు. బీసీ సోదరులందరూ జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎంపీ అభ్యర్థి అయిన తనను, ఎంపీ అభ్యర్థి రాచమల్లు శివప్రసాదరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ తాను నియోజకవర్గ పరిధిలోని యాదవుల అభివృద్ధికి ఎంతగానో తోడ్పాటు అందించానన్నారు. వారి పట్ల తనకు ప్రత్యేక గౌరవం ఉందని అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా యాలం తులశమ్మను, జెడ్పీటీసీ సభ్యురాలిగా గోర్ల రామలక్ష్మిని గతంలో నిలిపామని, ప్రస్తుతం ఎంపీపీగా సానబోయిన శేఖర్ యాదవ్‌ను నియమించామని, మున్సిపల్ కోఆప్షన్ సభ్యునిగా మల్లికార్జున ప్రసాద్ యాదవ్‌ను చేశామన్నారు. భవిష్యత్తులో యాదవుల సంక్షేమానికి మరింత ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ మాట్లాడుతూ సోములవారిపల్లె సర్పంచ్‌గా పోటీ చేసిన రమణయ్య యాదవ్‌ను వరదరాజులరెడ్డి ఓడించే ప్రయత్నం చేస్తే రాచమల్లు అండగా నిలబడి గెలిపించారన్నారు. 2014 ఎన్నికల సందర్భంగా యాదవ సామ్రాజ్యాన్ని కూలదోయాలని టీడీపీ అభ్యర్థి వరదరాజులరెడ్డి వేసిన కరపత్రాలు తనకు ఇంకా గుర్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు గోర్ల రామలక్ష్మి, న్యాయవాది జీవీ సుబ్బయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తులమ్మ శంకర్, ఎంపీటీసీలు ఓబయ్య యాదవ్, గోపాల్ యాదవ్, కూలూరు సర్పంచ్ శ్రీధర్ యాదవ్, నంగనూరుపల్లె సర్పంచ్ వెంకటలక్షుమ్మ, మాజీ సర్పంచ్ గోపిరెడ్డి రమణయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాబు మాటలు.. నీటి మీద రాతలు!

- ప్రతిసారి ప్రజలను మభ్యపెడుతున్న టీడీపీ అధినేత
- 2014లో ఇచ్చిన హామీలనే అమలు చేయని పరిస్థితి
- అంతకుమునుపు మదనపల్లె, తాజాగా రాజంపేటను జిల్లాగా మారుస్తామంటూ ప్రగల్భాలు
- బాబు వైఖరిపై విస్తుపోతున్న జనం



సాక్షి రాయచోటి: విశ్వసనీయత..నిజాయితీతో రాజకీయాలు చేసేవారు మొదటి రకమైతే.. ఏదో ఒక రకంగా తప్పుడు మాటలు చెబుతూ అప్పటికప్పుడు ప్రజల్లో పరపతి కోసం పాకులాడేవారు రెండోరకం. ప్రజాస్వామ్యంలో విలువలను కాలరాసి అధికారమే పరమావధిగా అడుగులు వేసే నాయకుల్లో ముందుగా చంద్రబాబును చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఎప్పుడు ఇక్కడికి వచ్చినా ఏదో ఒక రకంగా ప్రజలను మభ్యపెట్టి నానుతున్న సమస్యను ఎత్తి చూపి....తర్వాత అధికారంలోకి రాగానే బురిడీ కొట్టించడం టీడీపీ అధినేతకు పరిపాటిగా మారింది. గతంలోనూ 2014కు ముందు, తర్వాత అధికారంలోకి వచ్చినా అనేక రకాల హామీలను తుంగలో తొక్కారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజంపేటలో జరిగిన ప్రజాగళంలోనూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా చెప్పిన పలు మాటలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

హామీలు గాలికి..

ఒకప్పుడు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో.. ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలోని రాజంపేట ప్రాంతాన్ని ఉద్యాన హబ్‌గా మారుస్తానని ఎన్నోసార్లు ఊదరగొట్టిన బాబు తర్వాత ఆ హామీని గాలికి వదిలేశారు. 2014కు ముందు ఎన్నికల ప్రచారంలోనూ, తర్వాత అధికారంలో ఉన్నప్పుడు కూడా హబ్‌గా మారుస్తామంటూ ఐదేళ్లు కాలం గడిపారే తప్ప అమలుకు శ్రీకారం చుట్టలేదు. పండ్ల తోటలు విస్తారంగా ఉన్న రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టి అభివృద్ధి చేస్తామని చెప్పినా ఎక్కడా కూడా ఒక చిన్నపాటి పరిశ్రమ కూడా తీసుకురాలేదు. ఇలా అప్పుడు, ఇప్పుడు మారని మనిషిగా చెబుతూనే ఉన్నారు.

సుబ్బారావు మృతిపై 'పచ్చ' రాజకీయం

ఒంటిమిట్ట మండలం మాధవరానికి చెందిన చేనేత కార్మికుడు సుబ్బారావు కుటుంబం ఇటీవల భూ వివాదం వ్యవహారమై ఆత్మహత్య చేసుకుంది. అయితే దీన్ని కూడా చంద్రబాబు రాజంపేట కేంద్రంగా పచ్చరాజకీయం చేయడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2015-17 మధ్య టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనే రెవెన్యూ రికార్డుల్లో భూమికి సంబంధించిన మార్పులు, చేర్పులు జరిగాయి. అందులో భాగంగా కట్టా కుటుంబీకుల పేరు ఆన్‌లైన్‌లో కనిపిస్తోంది. అప్పట్లోనూ టీడీపీతో అంటకాగిన 'కట్టా' కుటుంబం ఇప్పుడు కూడా టీడీపీలోనే ఉంది. అయితే బాబు మాత్రం సుబ్బారావు కుమార్తె లక్ష్మీప్రసన్నను రాజంపేట సభా వేదికపై జనానికి పరిచయం చేసి వైఎస్సార్ సీపీ అన్యాయం చేసినట్లు చెప్పడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కళ్లెదుటే వాస్తవం కనిపిస్తున్నా రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు పచ్చకుట్రకు తెరలేపడంపై తెలుగు తమ్ముళ్లు గుసగుసలాడుతున్నారు.

మరోకసారి జిల్లా పేరుతో కపటనాటకం

టీడీపీ అధినేత చంద్రబాబుకు ఒక్కోసారి ఒక్కో మాట చెప్పడం సర్వసాధారణంగా మారింది. గతంలో టీడీపీ కార్యక్రమంలో భాగంగా మదనపల్లెకు వచ్చినప్పుడు జిల్లా కేంద్రంగా మారుస్తామని ప్రకటించారు. మళ్లీ ఎన్నికలకు ముందు రాజంపేట ప్రజాగళం సభలో మరొకమారు రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని నమ్మబలికారు. తాను ఎక్కడికి వెళితే అక్కడ రాజకీయ ప్రయోజనాల కోసం జిల్లా కేంద్రం చేస్తామని ప్రకటించడంపై ప్రజలు విస్తుపోతున్నారు. ఇదేమి రాజకీయాలంటూ ప్రజలు చర్చించుకోవడం కనిపిస్తోంది. ఏదిఏమైనా ఓట్లు, సీట్ల కోసం బాబు ఎన్ని కపట నాటకాలకైనా తెరతీస్తారని జిల్లా వాసులు విమర్శిస్తున్నారు.

ఎంసీసీ ఉల్లంఘనలపై సమాచారం అందించండి

- ఎన్నికల పరిశీలకులు భానుదాస్ పాలవె

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓటర్లను మభ్యపెట్టే చర్యలతోపాటు ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్), ఎన్నికల కమిషన్ నిబంధనల ఉల్లంఘన తదితర అంశాలపై వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు భానుదాస్ పాలవె ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి బద్వేలు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గాలలో పర్యవేక్షణ నిమిత్తం జిల్లాకు చేరుకున్న ఆయన ఆర్అండ్‌బీ అతిథి గృహంలోని ఎఫ్-3లో ప్రతి రోజు ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు అందుబాటులో ఉంటామన్నారు. నేరుగా గానీ లేదా సెల్ నంబరు 8712644924కు కాల్ చేసి గానీ సంప్రదించవచ్చన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికలను సజావుగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే చర్యలపై సమాచారం అందినా, నగదు, బంగారం, మద్యం తదితర ఓటర్లను మభ్యపెట్టే వస్తువుల పంపిణీ జరిగినా, అక్రమంగా రవాణా జరిగినా, మరే ఇతర ఎన్నికల నిబంధనల ఉల్లంఘన జరిగినా వెంటనే తమ సెల్ నెంబర్లకు కాల్ చేసి గానీ, వాట్సాప్ ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

ఆలయ భూముల వేలం వాయిదా

రాజుపాళెం : మండలంలోని పగిడాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, ఈశ్వర, ఆంజనేయ స్వాముల ఆలయాలకు సంబంధించిన భూముల వేలం పాట సోమవారం ఉదయం 11 గంటలకు జరగాల్సి ఉండగా వాయిదా పడినట్లు ఆలయ ఈఓ రామచంద్రాచార్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఎప్పుడు వేలం నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

తాగునీటి కోసం నీరు విడుదల



రాజోలి ఆనకట్ట వద్దకు చేరిన నీరు

రాజుపాళెం : మండల పరిధిలోని రాజోలి ఆనకట్ట నుంచి కుందూనది పరివాహక ప్రాంతంలో తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. రాజోలి ఆనకట్ట నుంచి ఆదివారం 30 క్యూసెక్కులు విడుదల అవుతుందని చెప్పారు. నంద్యాల జిల్లాలోని అవుకు రిజర్వాయర్ నుంచి పెద్దముడియం–ఉయ్యాలవాడ గ్రామాల మధ్యలో ఉన్న పాలేరు వాగు నుంచి కుందూనదికి నీటిని తరలిస్తున్నామన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

కడప అర్బన్ : కడప రిమ్స్ పోలీస్‌స్టేషన్‌లో డిస్ట్రిక్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్‌లో విధుల్లో వున్న కానిస్టేబుల్ కె. సునీల్‌కుమార్ (పి.సి.1347)ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కానిస్టేబుల్ విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడి కావడంతో జిల్లా ఎస్పీ సస్పెన్షన్ వేటు వేశారు.

వ్యక్తి అదృశ్యం



గంగాధర్‌రెడ్డి (ఫైల్)

ముద్దనూరు : మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన భీంచెర్ల గంగాధర్‌రెడ్డి (36) అదృశ్య మైనట్లు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.సీఐ దస్తగిరి కథనం మేరకు గంగాధర్‌రెడ్డి మార్చి నెల 28న కోవెలకుంట్లలోని అతని బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆరోజు అక్కడే వుండి మరుసటి రోజున తిమ్మాపురం బయలుదేరారు.ఆ రోజు ఉదయం 11గంటలకు కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండుకు వచ్చి,తిరిగి ఇంటికి రాలేదు. ఆదివారం గంగాధర్‌రెడ్డి తండ్రి ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నిందితులను పట్టుకుంటాం

వాల్మీకిపురం : మండలంలోని విఠలం వద్ద శనివారం జరిగిన టీడీపీ ప్రచార రథంపై ఇద్దరు గుర్తు తెలియని యువకులు పెట్రోల్ పోసి నిప్పంటించిన విషయం విదితమే. ఈ సంఘటనకు సంబంధించిన ప్రచార రథం డ్రైవర్ బాబాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ పులిశేఖర్ ఆదివారం తెలిపారు.నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



సోమాపురం : పార్టీలో చేరిన వారితో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : మండల పరిధిలోని సోమాపురం గ్రామంలో టీడీపీ షాక్ తగిలింది. గ్రామానికి చెందిన ముఖ్య టీడీపీ నాయకులు ఆదివారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రతిష్ట వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ ముఖ్య నాయకులైన లెక్కల సుధాకర్‌రెడ్డి, లెక్కల శ్రీనివాసులరెడ్డి, రాఘవరెడ్డిలతో పాటు వారి అనుచర వర్గీయులందరూ వైఎస్సార్‌సీపీ కండువా ధరించారు. సర్పంచ్ శ్రీనివాసుల రెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య, జెడ్పీటీసీ శాంతురాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీపేటలో..

లక్ష్మీపేట గ్రామంలో ఆదివారం గ్రామానికి చెందిన 10 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కర్నాటి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమక్షంలో గ్రామానికి చెందిన సునీల్ కుమార్‌రెడ్డి(మహేశ్వర ట్రావెల్స్), గురు మోహన్‌రెడ్డి, గురురెడ్డి, ఆజీ గురివి రెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, సుబ్బారెడ్డి, గురు భాస్కర్‌రెడ్డి తదితరులు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు.

చెంచయ్యగారిపల్లెలో..

బ్రహ్మంగారిమఠం: మండలంలోని చెంచయ్యగారిపల్లె గ్రామంలో యాదవ యూత్ సంఘం సభ్యులు దాదాపు 20మంది ఆదివారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరి చేరికకు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు సి.నాగేశ్వర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సి.కొండా రెడ్డి, స్థానిక నాయకులు సీతారామిరెడ్డి, తులసీరామిరెడ్డిలు కృషి చేశారు. గ్రామంలో త్వరలో యాదవ సమాజిక వర్గం అధిక సంఖ్యలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకు రానున్నట్లు నాగేశ్వర్‌రెడ్డి తెలిపాడు.

లింగాలదిన్నెపల్లెలో..

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మల్లేపల్లె పంచాయతీ లింగాలదిన్నెపల్లె గ్రామంలో ఆదివారం టీడీపీ కి చెందిన లెక్కల శ్రీకాంత్‌రెడ్డి, భూమిరెడ్డి వెంకటరమణారెడ్డి(ఆటోరమణ)భోరెడ్డి బాలనరసింహరెడ్డిలతో పాటు 20కుటుంబాల వారు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి. మండల పార్టీఅధ్యక్షుడు మేకల రత్నకుమార్‌యాదవ్, జెడ్పీటీసీ ఎం .రామగోవిందరెడ్డి. మాజీ సింగల్ విండో అధ్యక్షుడు సి.నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నందిమండలంలో..

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం గ్రామంలో 50 కుటుంబాలు ఆదివారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన చల్లా మల్లేష్, చల్లా నాగయ్య,సతీష్, సంజీవ్, రామ్‌బాబు, సాంబ, గంగులయ్య, చెన్నయ్య, ఉత్తయ్య, మస్తాన్, మహేష్, కిరణ్, జయరాజ్, చిన్నబ్బి, వీరాంజనేయులు, చెన్నారెడ్డి, వరదరాజరెడ్డి,శివ, నారాయణ, మధు, అలాగె సోగాల్‌పల్లె గ్రామానికి చెందిన చీమలపెంట రాజా, సోగపల్లె సాయి మరికొంత మందికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, మాజీ ఎంపీపీ అనూరాధ, జెసీఎస్ మండల కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీటీసీ సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీలత పాల్గొన్నారు.

చెన్నూరు మండలంలో..

చెన్నూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని భావించి ఆ నమ్మకంతోనే నేడు వైఎస్సార్‌సీపీలో భారీగా చేరుతున్నారని ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. చెన్నూరు మైనార్టీ కాలనీలో మైనార్టీ నాయకులు అన్వర్‌బాషా, మునీర్ అహ్మద్, సాదిక్ అలీ, అబ్దుల్ రబ్, హస్రత్, వారిష్, జుమన్, కరీంల ఆధ్వర్యంలో 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరందరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి సాదారంగా ఆహ్వానించారు.అదేవిధంగా, మండలంలోని గుర్రంపాడు గ్రామపంచాయతీలో వైఎస్సార్ సీపీ నాయకులు చల్లా మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన ఆరీఫ్, అన్వర్, మొహిద్దీన్, యాసీన్, జాఫర్, షకీల్, అలీ, ఖాదర్, గౌస్‌పీర్; ఫయాజ్, మౌలాలి, ముస్తఫా, ఖాజా, మహమ్మద్, కరీం, ఆజాంలను వైఎస్సార్ సీపీలో చేర్పించారు. కార్యక్రమంలో సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాజుల రెడ్డి , వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్ రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, ఆర్‌వీఎస్ఆర్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, చల్ల వెంకటసుబ్బారెడ్డి, చల్లా అన్వేష్, చల్ల శివారెడ్డి, జేసీసీ కన్వీనర్లు నిరంజన్ రెడ్డి, ఆరవేటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల మండలంలో..

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని వైకోడూరు గ్రామానికి చెందిన దాసరి రమణారెడ్డితో పలు కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి ఆదివారం జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి వీరికి పార్టీ కండవాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య తదతరులు పాల్గొన్నారు.

కమలాపురం మండలంలో..

కమలాపురం : మండల పరిధిలోని చిన్నచెప్పలి గ్రామంలో అండ్లూరు రాజారెడ్డికి చెందిన 100 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు సాయినాథ శర్మ ఆధ్వర్యంలో రాజారెడ్డి అనుచరులైన రమణ, నీలకంఠారెడ్డి, సత్తార్, మహ్మద్ గౌస్, ఫజుల్లా ఖాన్, సోమేష్ చిన్న, మాబాషా, మాబు తదితర 100 కుటుంబాల వారు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న చెప్పిందే చేస్తాడని, చేసేదే చెబుతారన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో తనను,ఎంపీ అవినాష్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నందిమండలంలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



లక్ష్మీపేటలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



వై కోడూరు : పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

టీడీపీ ప్రచారంలో నిందితుడు



ప్రచారంలో టీడీపీ అభ్యర్థి వరదరాజులరెడ్డితో నిందితుడు నిజాముద్దీన్

ప్రొద్దుటూరు : కొత్తపల్లె గ్రామ పంచాయతీ అమృతానగర్‌లో టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో నిందితుడు చెన్నూరు నిజాముద్దీన్ పాల్గొన్నారు. తన సతీమణి పేరుతో సఫినా రెహానా పేరుతో 143వ రేషన్ షాప్ నిర్వహిస్తున్న నిజాముద్దీన్ చక్కెర పంపిణీ చేయకుండా బ్లాక్ మార్కెట్‌కు అమ్ముకున్నాడని అదే ప్రాంతానికి చెందిన మాజీ విలేకరి గిద్దలూరు నాగరాజు ఆధారాలతో సహా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తన పైనే అధికారులకు ఫిర్యాదు చేస్తావా అని నిజాముద్దీన్ నాగరాజు నిర్వహిస్తు స్టూడియోకు వెళ్లి వస్తువులను ధ్వంసం చేయడమేగాకుండా భౌతిక దాడికి పాల్పడ్డారు. రక్తగాయాలైన నాగరాజు స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చేరారు. ఈనెల 24న కేసు నమోదు చేసినా ఇంత వరకు నిజాముద్దీన్‌ను పోలీసులు అరెస్టు చేయలేదు. పైగా ఆదివారం ఎన్నికల ప్రచారంలో బహిరంగంగా వరదరాజులరెడ్డి, ముక్తియార్‌లతో కలసి పాల్గొన్నారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఆ ప్రాంతమంతా ప్రచారం చేశారు. ఇప్పటికైనా నిందితుడిని అరెస్టు చేయడంతోపాటు డీలర్ షిప్‌ను సస్పెండ్ చేయాలని నాగరాజు ఈ సందర్భంగా అధికారులకు విన్నవించుకున్నాడు.

జంటహత్యల కేసులో నిందితుల అరెస్టు



నిందితులతో సీఐ, ఎస్ఐ తదితరులు

చిన్నమండెం : చిన్నమండెం మండలం దిగువగొట్టివీడు గ్రామం కమ్మపల్లె వద్ద జరిగిన జంటహత్యల కేసులో నిందితుడు వాగుత్తుల రెడ్డప్ప, అతని రెండో భార్య రాజేశ్వరిని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు.రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్, చిన్నమండెం ఎస్ఐ రమేష్‌బాబు కథనం మేరకు వివరాలు.. జావాజీవాండ్లపల్లెకు చెందిన మాబూబీ మేనల్లుడు గౌస్‌పీర్, రెడ్డప్ప భార్య లలిత(పద్మజ)తో అక్రమ సంబంధం పెట్టుకుని లేవదీసుకుని వెళ్లిపోయాడు. ఈ విషయంలో కమ్మపల్లెకు చెందిన వెంకట్రాయుడు, మహబూబ్‌బీ సహకరించారు. దీంతో వీరిపై వాగుత్తుల రెడ్డెప్ప కక్ష పెంచుకున్నాడు. ఈనెల 22న కమ్మపల్లె రెడ్డివారిపల్లె మధ్యలో కాశినాయన గుట్ట వద్ద వెంకట్రాయుడు(22) బైక్‌లో వెళుతుండగా రెడ్డెప్ప రెండో భార్య రాజేశ్వరి సహకారంతో గొడ్డలితో నరికి చంపాడు. అంతేకాకుండా షేక్ మహబూబ్‌బీని(58) కూడా విచక్షణారహితంగా గొడ్డలితో నరికి చంపాడు. ఈ విషయంపై వెంకట్రాయుడు భార్య సరస్వతి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించారు. రాయచోటి రూరల్ సీఐ తులసీరాం, చిన్నమండెం ఎస్ఐ రమేష్‌బాబులు సిబ్బందితో కలిసి నిందితుడి ఆచూకీ కోసం వెతకసాగారు. అయితే రెడ్డప్ప, ఆయన రెండో భార్య రాజేశ్వరి దేవగుడిపల్లె వీఆర్‌ఓ ఎదుట లొంగిపోయారు. వీఆర్‌ఓ వెంటనే సీఐ, ఎస్ఐల ఎదుట హాజరుపరచగా వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుండి గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు.

ఆర్ట్స్ కళాశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పూర్వ విద్యార్థుల సంఘం సమావేశంలో ప్రిన్సిపాల్





మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్, రూ.50వేలు చెక్కును ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న ఆచార్య రాజశేఖరరెడ్డి

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ కోరారు. ఆదివారం కడపలోని మానస ఇన్ హోటల్ సమావేశ మందిరంలో కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల) పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో అలుమ్నీ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కన్నతల్లిని, చదివిన విద్యాసంస్థను మరిచిపోకూడదన్నారు. తమ ఉన్నతికి సహకరించిన కళాశాలను అభివృద్ధి చేసేందుకు పెద్దసంఖ్యలో పూర్వ విద్యార్థులు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. అత్యధిక పూర్వ విద్యార్థుల రిజిస్ట్రేషన్‌తో దేశంలోనే కళాశాల చరిత్ర సృష్టించాలన్నారు. ఆగస్టు నెలలో 75 సంవత్సరాల ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. ప్లాటినం జూబ్లీ వేడుకల ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు, ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ పి. రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ కళాశాల జూబ్లీ వేడుకలు విజయవంతం చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అందరికీ తెలియజేప్పేలా సావనీర్ రూపకల్పన, 2కే రన్, టార్చ్‌ర్యాలీ నిర్వహించాలని సూచించారు. కళాశాల ప్రణాళికా అభివృద్ధి మండలి కార్యదర్శి లయన్ కె. చిన్నపరెడ్డి మాట్లాడుతూ కళాశాలలో చదివిన వారు వారి బ్యాచ్ విద్యార్థులకు సమాచారం అందించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సీఈఓ ఎం. వెంకటశివారెడ్డి మాట్లాడుతూ గతంలో 50 సంవత్సరాల వేడుకల్లో భాగస్వాములయ్యామని, మళ్లీ 75 సంవత్సరాల వేడుకల్లో పాల్గొనే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. కళాశాల ప్రగతికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. చైతన్య కెమికల్స్ అధినేత ఎస్.వి. రామమూర్తి, ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు ఎస్.ఎ. సత్తార్, సజ్జల జనార్దన్‌రెడ్డి, క్రీడాపాఠశాల విశ్రాంత ప్రత్యేకాధికారి డా. ఎం.వి. రామచంద్రారెడ్డి, గునిశెట్టి శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు. అనంతరం కళాశాల అభివృద్ధికి తమవంతుగా ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ఆచార్య పి. రాజశేఖరరెడ్డి రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈయనతో పాటు మాజీ ఎమ్మెల్సీ ఎంవీ శివారెడ్డి రూ.50వేలు, జంతుశాస్త్ర విశ్రాంత ఉపన్యాసకుడు డాక్టర్ మామిళ్ల వెంకటసుబ్బయ్య రూ.50వేలు, ఆంగ్ల అధ్యాపకుడు గునిశెట్టి శ్రీనివాసులు రూ.10వేలు చొప్పున విరాళం ప్రకటించారు. పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి శివరాం, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, పూర్వ విద్యార్థులు రాజారత్నం ఐజాక్, డా. సుధాకర్‌రెడ్డి, జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ రిజిస్ట్రార్ బాబు, మనోహర్‌రెడ్డి, నారాయణరెడ్డి, బాలసుబ్రమణ్యం, ఎం. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారంలో ఉద్యోగులు



టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాయచోటి బంగ్లా వద్ద గల స్టేట్ బ్యాంకులో పనిచేస్తున్న జవాజీఖాన్



గాలివీడు స్టేట్ బ్యాంకులో పనిచేస్తున్న న్యాజీ.జాఫర్‌ఖాన్ చిన్నమండెం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దృశ్యం



ప్రచారం నిర్వహిస్తున్న చిన్నమండెం-1 సచివాలయంలో పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న రెడ్డికుమార్

పట్టించుకోని అధికారులు

చిన్నమండెం : అన్నమయ్య జిల్లా రాయచోటిలో టీడీపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఉద్యోగులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. రాజకీయ పార్టీలకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నా కొంత మంది ఉద్యోగులు బహిరంగంగానే ప్రచారం చేస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. వారం రోజుల కిందట రాయచోటి మున్సిపాలిటీలోని 24వ వార్డులో అంగన్‌వాడీ ఉద్యోగి హాజీరా మైకు పట్టుకుని టీడీపీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని కోరారు. రెండు రోజులుగా చిన్నమండెం మండల పరిధిలో చిన్నర్సుపల్లి సచివాలయం సెక్రటరీ రెడ్డికుమార్ టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి వెంట ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అలాగే బాంబే ఏజాస్‌ఆలీఖాన్‌తో గాలివీడు స్టేట్ బ్యాంకు, రాయచోటిలోని బంగ్లా వద్ద గల స్టేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న న్యాజి జాఫర్‌ఖాన్, జవాజీఖాన్‌లు పార్టీ కండువాలు కప్పుకుని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికల అధికారుల చర్యలు లేకపోవడంతో కొంత మంది ఉద్యోగులు టీడీపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

కుక్కల దాడిలో పొడదుప్పి మృతి

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలో సమీపంలో కుక్కల దాడిలో పొడదుప్పి మృతి చెందినదని అటవీ అధికారుల తెలిపారు. తాగునీటి కోసం గ్రామ శివారులోని జగనన్న కాలనీ వద్ద ఉన్న పొలాల వద్దకు రావడంతో కుక్కలు వెంబడించి చంపాయన్నారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిద్దవటం పశువుల ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి సిద్దవటం రేంజర్ కార్యాలయం ఆవరణలో పొడదుప్పిని ఖననం చేసినట్లు తెలిపారు.

భూ కబ్జాదారుడు పుత్తా

కమలాపురం : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి భూ కబ్జాదారుడు, దౌర్జన్యపరుడు, చరిత్రహీనుడని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరశివారెడ్డి పుత్తాపై ఫైర్ అయ్యారు. తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ కోగటంలో తాను అల్లర్లు సృష్టిస్తున్నానని పుత్తా పేర్కొనడం దారుణమన్నారు. హత్యా రాజకీయాలతో చేతులకు రక్తం మరకలు అంటించుకున్న పుత్తా తనను విమర్శించడం సిగ్గుచేటన్నారు. నాలుగు సార్లు పోటీ చేసిన పుత్తా నాలుగు సార్లు ఓడిపోయాడని, నేను నాలుగు సార్లు పోటీ చేసి మూడు సార్లు గెలిచానన్నారు. కోగటంలో ఏజెంట్లు లేకుండా చేస్తానని చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ సమావేశంలో అనిల్ కుమార్ రెడ్డి, మోహన్ రెడ్డి, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు మండల పరిధిలోని తోల్లగంగనపల్లె క్రాస్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అరుణ్ కుమార్ (32) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు ప్రొద్దుటూరు పట్టణంలోని ఈశ్వర్‌రెడ్డి నగర్‌కు చెందిన అరుణ్ కుమార్ కడప నుంచి కమలాపురానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా తోల్లగంగనపల్లె క్రాస్ సమీపంలో ఎర్రగుంట్ల వైపు నుంచి కడపకు వెళుతున్న సిమెంట్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో అరుణ్ కుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేత్రదానం

పులివెందుల రూరల్ : పట్టణంలోని ప్రశాంతి నగర్‌కు చెందిన అవిలి ఎరికలమ్మ (75) ఆదివారం మరణించడంతో ఆమె కుమారులు గుర్రప్ప, పెద్దబాబు, కోడళ్లు లక్ష్మీదేవి, పద్మావతి, మనవళ్లు గురుచరణ్, సుధీర్, మనవరాలు సాయి సునయనలు నేత్రదానానికి అంగీకరించారు. ఈమేరకు స్నేహిత అమృతహస్తం సేవాసమితి నేత్రసేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారం ఇవ్వడంతో టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలి ఇంటి వద్దకు వెళ్లి పార్థివదేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డా.అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు ఎవరైనా మరణించినట్లైతే నేత్రదానానికి అంగీకారం తెలిపిన అనంతరం 9966509364, 7093204537లకు సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా నేత్రదానానికి అంగీకారం తెలిపిన కుటుంబ సభ్యులను బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛందంగా సేవలందించాలి

కడప అర్బన్ : సార్వత్రిక ఎన్నికలు –2024 లో సేవలను అందించేందుకు ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్, ఎక్స్ సర్వీస్‌మెన్‌లు ముందుకు రావాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రకటన విడుదల చేశారు. దేశభద్రత విషయంలో సైనికుల సేవలు నిరుపమానమనీ, పోలింగ్ సజావుగా సాగేందుకు మీ వంతు సహకారం అందించాలని, ఎన్నికల విధుల్లో భాగస్వామ్యం అయ్యేవారికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కలుగచేస్తామనీ ఎస్పీ తెలిపారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్ యువతీ, యువకులు కూడా ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యులు కావాలనీ జిల్లా ఎస్పీ కోరారు. అర్హత, ఆసక్తి వున్న ఎన్.సి.సి,ఎన్.సి.సి, ఎక్స్ సర్వీస్‌మెన్‌లు తమ తమ అసెంబ్లీ నియోజకవర్గ పోలీస్ నోడల్ అధికారి (డీఎస్పీ)ని సంప్రదించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ సిద్దార్థ కౌశల్

చింతకొమ్మదిన్నె : ప్రజలు ఎలాంటి ప్రలోభాలు, భయానికి లోనుకాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించు కోవాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ప్రజలకు సూచించారు. ఆదివారం కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో క్రిటికల్ గ్రామంగా గుర్తించిన చింతకొమ్మ దిన్నె గ్రామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. జిల్లా ఎస్పీ వెంట చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్ నాయక్, సిబ్బంది ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ అన్నారు. ఆదివారం దాల్మియా కర్మాగారం అతిథి గృహంలో జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గ పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై పోలీసు అధికారులు నిఘా పెట్టాలన్నారు. అనంతరం చిన్న కొమెర్ల గ్రామాన్ని సందర్శించి ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు.జిల్లా ఆదనపు ఎస్పీ వెంకటరాముడు, జమ్మలమడుగు డీఎస్పీ టి.డి యశ్వంత్ ప్రొబేషనరీ డీఎస్పీ శ్రీకాంత్, సీఐలు కరుణాకర్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.